క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం


శ్రీగిరిలో చతుర్వేద పారాయణలో అర్చకులు

ఒంగోలు మెట్రో: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఒంగోలులోని శ్రీగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు, వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నాదనీరాజనం, చతుర్వేద పారాయణ, విష్ణుసహస్రనామ పారాయణ, భారత భాగవత భగవద్గీత రామాయణ శ్లోకాలను గానం చేశారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

చెన్నకేశవస్వామికి వెండి వస్తువుల అందజేత


చెన్నకేశవస్వామికి వెండి వస్తువులు సమర్పిస్తున్న దాతలు

ఒంగోలు మెట్రో: శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని కొప్పోలు వాస్తవ్యులు పాటిబండ్ల వీరరాఘవులు, పద్మావతి దంపతులు కొప్పోలు కేశవక్షేత్రం చెన్నకేశవ ఆంజనేయస్వామి దేవస్థానంలో చెన్నకేశవస్వామికి 18,000 విలువ చేసే వెండి వస్తువులను శనివారం అందజేశారు. 110 గ్రాముల రజిత హృదయ లక్ష్ములు సమర్పించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశం సమీర్ కుమార్ శాస్త్రోక్తంగా విశ్వక్సేన పూజ, పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించి దాతల చేతుల మీదుగా స్వామివారికి వెండి వస్తువులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి కట్ట సునీల్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ బిల్‌ను రద్దు చేయాలి


మాట్లాడుతున్న యల్లమందారెడ్డి

పొదిలి: కొత్త పెన్షన్లు, పాత పెన్షన్ల మధ్య వ్యత్యాసం ఏర్పడి పాత పెన్షనర్లు నష్టపోయే ఫైనాన్స్ బిల్ 2025ను వెంటనే రద్దు చేయాలని పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఏ.బాదుల్లా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొదిలి తాలూకా పెన్షనర్ల సంఘ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక పెన్షనర్ల భవనంలో జరిగింది. ప్రధాన కార్యదర్శి షేక్ మదార్‌వలి, యల్లమందారెడ్డి మాట్లాడుతూ 15వ తేదీన ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఫైనాన్స్ బిల్ 2025ను రద్దు చేయాలని, కేంద్రంలో 8వ పే కమిషన్, రాష్ట్రంలో 12వ పే కమిషన్ వెంటనే నియమించాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించాలంటూ వేడుకోలు

పుల్లలచెరువు: తమకు జీతాలు ఇప్పించాలంటూ స్థానిక గ్రామ పంచాయతీ కార్మికులు వేడుకుంటున్నారు. ఈ మేరకు వారు శనివారం మాట్లాడుతూ తమను పనులకు మాత్రమే వాడుకుంటున్నారని, కనీసం తాము ఎలా జీవనం సాగించాలో సర్పంచ్, కార్యదర్శి లోచన చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వండని అధికారుల చుట్టూ తిరిగి కాళ్లు అరుగుతున్నాయని, తమ లాంటి చిరుద్యోగులు జీతాలు లేకుంటే ఎలా జీవనం సాగిస్తారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతాలు వచ్చే ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

వికసిత్ భారత్ కోసం మోదీ కృషి

త్రిపురాంతకం: వికసిత్ భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆ పార్టీ మండల సమావేశం శనివారం జరిగింది. జాతీయ స్థాయిలో బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. అనంతరం ఆయన మండల కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షురాలిగా మునికుమారిని ప్రకటించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.పిచ్చయ్య, మల్లికార్జున్, నాసరరెడ్డి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు నాగేశ్వరావు, నర్సయ్య, వీరాంజనేయులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మోసానికి మారుపేరు.. చంద్రబాబు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు



చుండూరి రవిబాబు, మన్నే శ్రీనివాసరావును సన్మానిస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు విమర్శ
- పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలని డిమాండ్
- కరవదిలో ఘనంగా పార్టీ ఒంగోలు మండల విస్తృత స్థాయి సమావేశం

ఒంగోలు సిటీ:

ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మోసానికి బ్రాండ్ అంబాసిడర్‌గా సీఎం చంద్రబాబు నిలిచారని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు ధ్వజమెత్తారు. శనివారం వైఎస్సార్ సీపీ ఒంగోలు మండల విస్తృత స్థాయి సమావేశాన్ని కరవది గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ అనే కార్యక్రమానికి సంబంధించి నిర్వహించిన ఈ సమావేశానికి పార్టీ ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ కూటమి నేతలు అనేక విధాలుగా ప్రజలను, వైఎస్సార్ సీపీ శ్రేణులను వేధిస్తున్నారన్నారు. కానీ, ఎవరూ అధైర్యపడొద్దని అన్నారు. రాష్ట్రస్థాయిలో జగనన్న, వైఎస్సార్ సీపీ లీగల్ టీం అండగా ఉన్నట్లు తెలిపారు. పార్టీ పటిష్టతకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ధైర్యంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోందన్నారు. ఎన్నికల ముందు బాబు వస్తే జాబు వస్తుందని, యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగ అవకాశాలు వస్తాయని నమ్మబలికి అధికారం చేపట్టిన తర్వాత దారుణంగా యువతను మోసం చేశారని విమర్శించారు. పేదలకు సంక్షేమ పథకాలతో పాటు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యంను ఉచితంగా అందజేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పోలీసులతో అక్రమ కేసులు బనాయించడం సరికాదని, అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

జగనన్నను సీఎం చేసుకుందాం...

రాబోయే ఎన్నికలను వైఎస్సార్ సీపీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కొని మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందామని, అప్పటి వరకు ఎవరూ విశ్రమించరాదని చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. టీడీపీ పాలనలో గుర్తుండిపోయే పథకాలు ఒక్కటైనా ఉన్నాయేమో చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్, జగనన్న పథకాలే ప్రజలకు అందాయని, అందుకే జనం వారిని హృదయాల్లో నిలుపుకున్నారని అన్నారు. చంద్రబాబు పాలనంతా అబద్ధాలు, మోసాలేనని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజలకు పిలుపునిచ్చారు. ముందుగా కరవది రైల్వేగేటు నుంచి సాయిబాబు మందిరం వరకు ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించి చుండూరి రవిబాబుకు స్వాగతం పలికారు. మండల పరిధిలోని నాయకులను చుండూరి రవిబాబు శాలువాతో ఘనంగా సన్మానించారు. చుండూరి రవిబాబు, మన్నే శ్రీనివాసరావును గ్రామ నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చుంచు రామకృష్ణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటరు ఇమ్రాన్‌ఖాన్, నాయకులు పాలడుగు రాజీవ్, దామరాజు క్రాంతికుమార్, మల్లిశెట్టి దేవ, వేముల శ్రీకాంత్, చిన్న, అయ్యప్పరెడ్డి, జి.వెంకటేశ్వర్లు, నారపురెడ్డి, ఆదిశేషయ్య, కోటియాదవ్, వై.వి.గౌతమ్‌అశోక్, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గోనుగుంట్ల రజనీ, మాధవి, అంజమ్మ, భూమిరెడ్డి రమణమ్మ, పేరం ప్రసన్న, వాణి, మేరీకుమారి, వాకా ప్రసన్న కుమార్‌రెడ్డి, బి.హనుమంతరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్ సీపీ నాయకునికి బూచేపల్లి నివాళి


నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

చీమకుర్తి రూరల్: మండలంలోని పిడతలపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం మండల అధ్యక్షుడు మేకల వీరారెడ్డి తండ్రి, పార్టీ సీనియర్ నాయకుడు గోవింద రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి శనివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, కత్తి రమణారెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, నల్లూరి చంద్రారావు, శేషారెడ్డి, సుంకర శ్రీను తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

బౌద్ధ ధర్మంలో జ్ఞానమే ప్రధానం

ఒంగోలు వన్‌టౌన్: బౌద్ధ ధర్మంలో శీలము, జ్ఞానమే ప్రధానమని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు, నేషనల్ ట్రస్టీ ఉపాసక వై.హరిబాబు అన్నారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఒంగోలు నగరంలోని బౌద్ధధర్మ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2,533 సంవత్సరాల క్రితం గౌతమ బుద్ధుడు శీలము, జ్ఞానము ప్రధానంగా ఆషాఢ పౌర్ణమి రోజున ఆష్టాంగ మార్గాన్ని బోధించాడన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా మానవ సమాజంలో అశాంతి నెలకొందన్నారు. ఈ సమస్యకు అప్పట్లోనే బుద్ధుడు పంచశీల, ఆష్టాంగ మార్గం ద్వారా పరిష్కారం చూపించాడన్నారు. స్థానిక కలెక్టరేట్ వద్ద నుంచి ట్రంకురోడ్డు, గానుగపాలెం, రంగరాయుడు చెరువు మీదుగా గాంధీ పార్కు వద్ద బుద్ధ వందనం, అంబేడ్కర్ వందనంతో పాదయాత్ర ముగిసింది. కార్యక్రమంలో కందుకూరు ధర్మచక్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉపాసక జి.హరిప్రసాదరావు, ఓపీడీఆర్ రాష్ట్ర నాయకుడు ఉపాసక చావలి సుధాకరరావు, ఉపాసకులు పాల్గొన్నారు.


పాదయాత్రలో పాల్గొన్న ఉపాసకులు

సీతమ్మకు ఆషాడం సారె సమర్పణ


సీతమ్మ వారికి సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: నగరంలోని చేజర్లవారివీధిలో గల శ్రీరామ మందిరంలో ఆషాడ మాస పూజలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం మహిళలు సామూహికంగా ఊరేగింపుగా వచ్చి సీతమ్మ అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో దేవేరులకు షోడశోపచారదేవి ఖడ్గమాల కుంకుమ పూజలను అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కనకధారస్తోత్ర పారాయణం, లలితా సహస్రనామ పారాయణం చేశారు.

నయనమనోహరంగా గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: ఆషాడ మాసం శనివారం శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీగిరి గిరి ప్రదక్షిణను కమిటీ ఆధ్వర్యంలో అత్యంత శోభాయమానంగా నిర్వహించారు. ముందుగా గోపూజ చేశారు. గిరి ప్రదక్షిణలో గోకులం కోలాట భజన మండలి సభ్యులు తమ కోలాటం నర్తనతో శ్రీవారికి అర్చన చేశారు. కోలాటపద నర్తనతో శ్రీగిరి పురవీధులు శోభిల్లాయి. కారుమూరి లలిత శ్రీనివాస్ అన్నమాచార్య కీర్తనలు, భక్తి పాటలు ఆలపించారు. శ్రీగిరి గిరి ప్రదక్షిణకు విచ్చేసిన భక్తులు గోవింద నామాలు ఆలపించారు. సుందరంగా అలంకరించిన పల్లకిలో శ్రీవారి ఉత్సవమూర్తిని ఉంచి గిరి ప్రదక్షిణ చేశారు. గరుడ హనుమాన్ శంకు చక్ర త్రిపుండ్రలను చేపట్టి భక్తులు ఉదయం ఐదు గంటలకు మంగళ వాయిద్యాలతో శ్రీగిరి పాలపీఠం వద్ద గోశాల వద్ద నుంచి గిరి ప్రదక్షిణకు బయలుదేరారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు పాల ప్రసాదాన్ని పంపిణీ చేశారు. శ్రీగిరి గిరి ప్రదక్షణ కమిటీ కోశాధికారి ఓలేటి కృష్ణారావు, సహ కార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, సభ్యులు ధనిశెట్టి రామునాయుడు, చలువాది బ్రహ్మయ్య, శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

157 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొత్తపట్నం: మెరైన్ కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ వారి సహకారంతో ఒంగోలు నల్లూరి నర్సింగ్ హోం వారి సౌజన్యంతో మండలంలోని మోటుమాల గ్రామంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రాయతీతో ఆపరేషన్లు చేస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపీనాథ్ జెట్టి, మెరైన్ కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వై.గోవిందరావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 157 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెరైన్ సీఐ ఎస్.సాంబశివరావు, ఎస్సై పి.సుబ్బారావు, వైద్యులు డాక్టర్ శివరామకృష్ణ, గుండె వైద్య నిపుణులు డాక్టర్ కుషాల్ కుమార్, సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ హరీష్ కుమార్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సంఘ నాయకులు పి.మస్తాన్‌రెడ్డి, మౌలాలి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరు, పారిశుద్ధ్య కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్మికులు శనివారం బైక్ ర్యాలీతో పాటుగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, క్యాటగిరీ వారీగా కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని, రిటైర్డ్ అయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగం కల్పించాలని, వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని వంటి డిమాండ్ల సాధన కోసం కార్మికులు ఐకమత్యంగా పోరాడతారన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పుల్లయ్య, నాగయ్య, రంగస్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలపై గెస్ట్ లెక్చర్

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగావకాశాలపై శనివారం గెస్ట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలోని రామానుజన్ సెమినార్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం వివరాలను విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ శ్రీగాయత్రి వెల్లడించారు. చెన్నైకి చెందిన మైక్రో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయరాజేశ్వరన్ ముఖ్య అతిథిగా హాజరై నాలుగో సంవత్సరం చదువుతున్న ఈసీసీ, ఈఈఈ విద్యార్థులకు ఇండస్ట్రీ 4.0, డిజిటల్ ట్విన్ సాంకేతిక పరిజ్ఞానం, సీమోన్స్ కోమోస్-సిమిట్, పీఎల్సీ, ఎల్‌ఓటీ 2050 గేట్‌వేలు, ఏఎల్, ఏఆర్, వీఆర్‌లను పరిశ్రమల్లో ఎలా ఉపయోగిస్తారో వివరించారు. అంతేగాకుండా ఈ టెక్నాలజీలకు సంబంధించి ఉద్యోగ అవకాశాలను కూడా తెలియజేశారు. అనంతరం ఈఈఈ, ఈసీఈ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ గెస్ట్ లెక్చర్ తమకి ఎంతగానో ఉపయోగపడిందని, సరికొత్త విషయాలు తెలుసుకోవడంతో పాటు ఉద్యోగ అవకాశాలు పొందామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్యమెహర్, కళాశాల ఇంటర్నేషనల్ అఫైర్స్ డైరెక్టర్ డాక్టర్ జాఫర్, ఈసీసీ హెచ్‌వోడీ డాక్టర్ హిమబిందు, డాక్టర్ నవనీత కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ విజయరాజేశ్వరన్

12 గంటలైనా..తెరుచుకోని పశువైద్యశాల


12 గంటలైనా తెరుచుకోని చోళ్లవీడు గ్రామీణ పశువైద్యశాల


12.13 గంటలకే మూతపడిన అనుములపల్లె గ్రామీణ పశువైద్యశాల

రాచర్ల: మండలంలోని చోళ్లవీడు గ్రామంలోని గ్రామీణ పశువైద్యశాల శనివారం మధ్యాహ్నం 12 గంటలవుతున్నా తెరుచుకోలేదు. గతంలో ఇక్కడ లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఏ.శివచరణ్ గౌడ్ అనుములపల్లె గ్రామానికి బదిలీ కాగా ఆయన స్థానంలో సుప్రియ బాధ్యతలు స్వీకరించారు. బదిలీలు జరిగి దాదాపు నెలవుతున్నా చోళ్లవీడు గ్రామీణ పశువైద్యశాల సక్రమంగా తెరవడం లేదని పశుపోషకులు ఆరోపించారు. శనివారం రైతులు, గొర్రెల కాపరులు పశువైద్యశాలకు వచ్చి వేచి ఉన్నా ఎవరూ ఎంతసేపటికీ రాకపోవడంతో వెనుతిరిగారు. అంతేకాక అనుములపల్లె గ్రామీణ పశువైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఏ.శివచరణ్ గౌడ్ మధ్యాహ్నం 12:13 గంటలకే తాళాలు వేసి వెళ్లిపోయారు. మళ్లీ సాయంత్రం విధులకు రావాల్సి ఉండగా డుమ్మాకొడుతున్నారని రైతులు ఆరోపించారు. ఈ రెండు గ్రామాల్లో సకాలంలో పశువులకు, గొర్రెలకు, మేకలకు వైద్య సేవలు అందడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని చోళ్లవీడు, అనుములపల్లె గ్రామాల్లోని గ్రామీణ పశువైద్యశాలల్లో పనిచేసే లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌లు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల పశుపోషకులు కోరుతున్నారు.

మంచినీటి సమస్యతో అవస్థలు


బోరు నుంచి బయటకు తీసిన విద్యుత్ మోటార్


మోటార్ సైకిల్‌పై నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

- జేసీ అగ్రహారంలో మరమ్మతులకు గురైన విద్యుత్ మోటార్

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో సింగిల్ ఫేజ్ విద్యుత్ మోటార్ మరమ్మతులకు గురైంది. జగనన్నకాలనీ వెళ్లే రోడ్డులోని విద్యుత్ మోటార్ 20 రోజులుగా పనిచేయడం లేదు. పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కరించలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు లోపలి నుంచి విద్యుత్ మోటార్ బయటకు తీసి మరమ్మతులు చేయిస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోకి వెళ్లి గృహ అవసరాలకు, పశువులకు సరిపడా నీటిని తెచ్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం


బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కంభం: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బాలుడి మృతి విషయంలో కేసు దర్యాప్తులో ఉండగానే సహజ మరణమంటూ పోలీస్ ఉన్నతాధికారులు ఇచ్చిన స్టేట్‌మెంట్ బాధాకరమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి షాలెంరాజు అన్నారు. శనివారం లింగోజీపల్లి గ్రామానికి వెళ్లి బాలుడు లక్షిత్ కుటుంబ సభ్యులను ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలుడి కుటుంబానికి న్యాయం జరగాల్సిన విషయంలో ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పోలీసులు వాస్తవాలు బయటకు తీసి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవసరమైతే ఉన్నతాధికారులతో విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలన్నారు. తాము బాలుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్న నేపథ్యంలో సమాచారం తెలుసుకున్న పోలీసులు పూర్తి స్థాయిలో తమ మీద నిఘాపెట్టారని, తాము సంఘద్రోహులం కాదన్నారు. ఒక కుటుంబం ఇబ్బందులు పడుతుంటే వాళ్లకు అండగా నిలబడేందుకే ఇక్కడికి వచ్చామే తప్పా ఎటువంటి అలజడి చేయడానికి రాలేదన్న విషయాన్ని పోలీసులు గుర్తించాలన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

2010 పీఆర్‌సీ ప్రకారం వేతనాలు చెల్లించాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, ఉద్యోగులకు 2010 పీఆర్‌సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని సౌత్ ఇండియా ఈపీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ కోరారు. ఒంగోలు హైదరీక్లబ్‌లో శనివారం విభిన్న ప్రతిభావంతుల శాఖ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. కె.ఈశ్వరరావు అధ్యక్షత వహించగా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ జీఓ నంబర్ 27 ప్రకారం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్పొరేషన్ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా వై.హనుమంతారెడ్డి, ఉపాధ్యక్షునిగా కేసీహెచ్ రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఈశ్వరరావు, తదితర సభ్యులను ఎన్నుకోగా, ప్రమాణస్వీకారం చేశారు.